andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5, కనిష్ఠం 10.4
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 21 నవంబరు 2025



క్రీడలను వృత్తిగా భావించాలి

» జోనల్ స్థాయి ఖోఖో పోటీల ప్రారంభంలో డీడీ అంబాజీ జాదవ్



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న డీడీ అంబాజీ జాదవ్

ఉట్నూర్,నవంబరు20 (ఆంధ్రజ్యోతి): క్రీడలను వృత్తిగా భావించాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ అంబాజీ జాదవ్ అన్నారు. మండలకేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో గురువారం జోనల్ స్థాయి ఖోఖో పోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోటీలకు హాజరైన నిర్మల్ ఆదిలాబాద్ ఆసిఫాబాద్ మంచిర్యాల జిల్లాల జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆదిలాబాద్ జట్టువిజేతగా, ఆసిఫాబాద్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయి పోటీకి ఆదిలాబాద్ జిల్లా ఖోఖో జట్టును ఎంపిక చేశారు. విజేతలకు ఏటీడీఓ సదానందం బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారధి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఆడె రామేశ్వర్, హెచ్ఎం జాదవ్ ఉత్తమ్, పీడీ జాదవ్ హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రామేశ్వర్ తెలిపారు. గురువారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్-14 ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులు బౌలింగ్, బ్యాటింగ్ చేసి ప్రతిభ చూపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని జోనల్‌స్థాయికి ఎంపిక చేయనున్నట్లు రామేశ్వర్ తెలిపారు. నైపుణ్యం కలిగిన క్రీడాకారులకే చోటుదక్కుతుందని, వారు మరింత క్రమశిక్షణతో ఆడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ రాష్ట్రపాల్ జాబాడే, స్పోర్ట్స్ సూపరింటెండెంట్ రజియొద్దీన్, పీడీలు మోహన్ రెడ్డి, వినోద్‌రెడ్డి, నిషాంత్, అశోక్, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎన్నికల సామగ్రిని క్లస్టర్ల వారీగా వేరు చేస్తున్న సిబ్బంది

క్లస్టర్ల వారీగా ఎన్నికల సామగ్రి

బోథ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాధికారుల ఆదేశాల మేరకు గురువారం బోథ్ ఎంపీడీవో రమేష్ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా సవరణ చేపట్టారు. మొదట గ్రామపంచాయతీ ఎన్నికల సామగ్రిని క్లస్టర్ల వారీగా విభజించారు. గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఈ ప్రక్రియను పూర్తి చేసి ఎంపీడీవో కార్యాలయంలో రిపోర్టు చేయాలని సూచించారు.

ఇక లెక్క పక్కా!
» ఇరిగేషన్ అధికారుల నజర్
» నిర్మల్‌లో 659 చెరువులు
» తూములు, కాలువలపై ఆరా
8

జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ పార్క్, భూములు ఇవే..





ఇండస్ట్రియల్ పార్కులో అక్రమాల బాగోతం

రూ.కోట్లు విలువ చేసే భూములు కనుమరుగు

జిల్లాలో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇండస్ట్రియల్ పార్కులో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇండస్ట్రీ భూముల్లో కొందరు వ్యాపారాలు నేతలు అడ్డగోలు దందాలకు ఎగబడుతున్నారు. రూ.కోట్లు విలువ చేస్తే భూములు కనుమరుగు అవుతున్నాయి.

» నిబంధనలకు పాతర
» వ్యాపారుల ఇష్టారాజ్యం
» నోటీసులిస్తూ చేతులు దులుపుకున్న కార్పొరేషన్ అధికారులు
» కలెక్టర్ దృష్టి పెడితేనే అక్రమాలకు అడ్డుకట్ట

ఆదిలాబాద్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): 1973లో రాష్ట్రప్రభుత్వం జిల్లాకేంద్రంలోని దస్నాపూర్ కాలనీలో 37 ఎకరాల విస్తీర్ణంలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసింది. దీని నిర్వహణ బాధ్యతను తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్(టీఎస్ఐఐసి)కి అప్పగించింది. అప్పట్లో ప్రారంభించిన కొద్ది కాలానికి పరిశ్రమలు పూర్తిగా మూతపడ్డాయి. క్రమంగా విలువైన ఇండస్ట్రియల్ భూములు కబ్జాదారుల కన్నుపడి కనిపించకుండానే పోతున్నాయి. 37 ఎకరాల గాను ప్రస్తుతం 20 ఎకరాలకే ఇండస్ట్రియల్ పార్కు పరిమితమైంది. దాదాపుగా 17 ఎకరాల ఇండస్ట్రియల్ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయింది. జిల్లా కేంద్రానికి నడిబొడ్డున ఉండడంతో ఈ భూములకు భారీ డిమాండ్ ఏర్పడుతోంది. గతంలో 50 పరిశ్రమలతో ప్రారంభమైన ఇండస్ట్రియల్ పార్కు ప్రస్తుతం రెండు, మూడు పరిశ్రమలతోనే కొనసాగుతోంది. కొందరు వ్యాపారాలు బినామీ పేర్లతో విలువైన భూములను సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే అడ్డగోలుగా నిర్మాణాలను చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు కొనసాగిస్తున్న జిల్లా అధికార యంత్రాంగం, కార్పొరేషన్ అధికారులు అటువైపు కన్నెత్తైనా చూడడంలేదు. ఇండస్ట్రియల్ పార్కులో జరుగుతున్న అక్రమాలపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

పెరిగిపోతున్న జనసంచారం

ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమలను ఏర్పాటుచేసి పలు రకాల ఉత్పత్తులను చేపట్టాల్సి ఉంటుంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా మాల్స్ ఫంక్షన్‌హాల్స్, హోటల్స్, అపార్ట్‌మెంట్స్‌ను ఏర్పాటు చేస్తూ వ్యాపారులు అడ్డగోలు దందాలకు ఎగబడుతున్నారు. ఇండస్ట్రియల్ పార్కులో జనసంచారం ఉండకూడదనే నిబంధన ఉన్న అధికారులు అవేమీ పట్టించుకోకుండా కొత్త నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. ఏదైనా జరగకూడని ఘటన జరిగితే బాధ్యులు ఎవరన్నా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మూతబడిన పరిశ్రమలను పునరుద్ధరించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాల్సిన అధికారులే అక్రమాలకు అండగా నిలుస్తున్నారు. మూతపడిన పరిశ్రమలను లీజుకు తీసుకుంటూ కొత్త వ్యాపారాలను మొదలు పెడుతున్నారు. పేరుకే ఇండస్ట్రియల్ పార్కు. అయినా పలు రకాల వ్యాపారాలతో నిత్యం జన సంచారంతో రద్దీ మరింత పెరిగిపోతోంది. అధికార పార్టీ నేతల అండతో కొందరు వ్యాపారాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులు అడ్డుచెప్పక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నోటీసులు ఇస్తున్నా.. చర్యలేవి?

ఇండస్ట్రియల్ పార్కులో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన వ్యాపార సంస్థలకు నోటీసులు ఇస్తున్న సంబంధిత అధికారులు చర్యలు తీసుకునేందుకు మాత్రం వెనుకాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు ఈ భూములపై రాష్ట్రస్థాయిలో చక్రం తిప్పారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటివరకు పలు వ్యాపార సంస్థలకు నోటీసులు ఇచ్చినా ఏఒక్కరిపైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఉన్న పరిశ్రమలకు ఆస్తి పన్నును చెల్లించకుండా ఎగనామం పెడుతున్నారు. దీంతో రూ.కోట్ల బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తోంది. తమ పరిధిలోకి రాదన్న కారణంగా మున్సిపల్ అధికారులు కూడా పన్ను బకాయిలపై దృష్టి సారించడం లేదు. గతంలో ప్రతీయేటా 30లక్షల వరకు పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రెండు, మూడు లక్షలకే పరిమితమవుతున్నట్లు అధికారులు (మిగతా 6లో..)

కొరవడిన నిఘా..

జిల్లాకేంద్రంలోని ఇండస్ట్రియల్ పార్కు భూములపై అధికారుల నిఘా కొరవడుతోంది. దీంతో విలువైన భూములు కనుమరుగవుతున్నాయి. గత కొన్నేళ్లుగా నిజామాబాద్ జిల్లాకు చెందిన అధికారులే ఇండస్ట్రియల్ పార్క్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. స్థానికంగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పార్కు చుట్టూ ఉన్న నివాస ప్రాంతాల ప్రజలు పార్కుభూములపై కన్నేసి కబ్జా చేస్తున్నారు. ఆపైగా తప్పుడు నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి గుట్టుచప్పుడు కాకుండా రూ.కోట్లకు అమ్మేసుకుంటున్నారు. ఇదంతా మున్సిపల్ అధికారులకు తెలిసినా క్రమబద్ధీకరణ పేరిట అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. కొందరైతే లీజుపత్రాలతో కోర్టును ఆశ్రయిస్తూ రూ.కోట్లు విలువ చేసే భూములను దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారుల అనుమతులు లేకుండానే విక్రయాలు జరుపుతున్నారు. అలాగే యథేచ్ఛగా రిజిస్ట్రేషన్‌లు చేస్తూ అమ్మేసుకుంటున్నారు.



మాట్లాడుతున్న పీవో యువరాజ్ మర్మాట్

జీసీసీకి లాభాలు తేవాలి

» ఇన్‌చార్జి పీవో యువరాజ్ మర్మాట్

ఉట్నూర్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల ప్రజలకు సేవలు అందించడానికి ఏర్పాటుచేసిన గిరిజన సహకార సంస్థను లాభాల బాటలోకి తెచ్చేలా ఉద్యోగులు అధికారులు ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి చాంబర్‌లో నిర్వహించిన గిరిజన సహకార సంస్థ సమీక్ష సమా వేశంలో ఇన్‌చార్జి డీఎం గుడిమల్ల సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో సమీక్షించారు. జీసీసీ ఆధ్వర్యంలోని పెట్రోల్ బంక్‌ల ఆదాయ వ్యయాలపై సమీక్ష నిర్వహించారు. అనవసర ఖర్చులు తగ్గించుకొని, లాభాల బాటలో నడపాలని సూచించారు. పెట్రోల్ బంక్‌లలో అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని, పరిసరాల శుభ్రత పాటించాలని అవసరమైనచోట సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసే ఆహార పదార్థాలలో నాణ్యత పాటించాలన్నారు. సమావేశంలో జీసీసీ డివిజనల్ మేనేజర్ సందీప్ కుమార్, మేనేజర్లు సంతోష్ కుమార్, గులాబ్‌సింగ్, ఇస్తారి, మనోహర్, లక్ష్మణ్, సొసైటీ అకౌంటెంట్లు, పెట్రోల్ పంప్ ఇన్‌చార్జిలు, తదితరులున్నారు.

హలో రైతన్న.. చలో భోరజ్‌ను జయప్రదం చేయాలి

నేరడిగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నేటి హలో రైతన్న చలో భోరజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని బోరాజ్ రహదారిపై రైతులకోసం చేస్తున్న ధర్నా కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొనాలని కోరారు.



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ

ఆదిలాబాద్‌టౌన్/నేరడిగొండ, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జలసంరక్షణలో ఆదర్శంగా నిలిచి రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్న కలెక్టర్ రాజార్షిషాకు అభినందనలు వెల్లువెత్తాయి. వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్జీఓ యూనియన్, తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్‌ను సత్కరించింది. అలాగే జర్నలిస్టులు కలెక్టర్‌ను కలిసి సత్కరించారు. రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు స్వీకరిస్తున్న చిత్రాన్ని బహూకరించి సన్మానించారు. జిల్లా అభివృద్ధికి చేస్తున్న కృషి పట్ల అభినందించారు.



కలెక్టర్‌కు చిత్రాన్ని బహూకరిస్తున్న జర్నలిస్టులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

'స్థానిక' ఎన్నికలను సజావుగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు రాజార్షిషా అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓవర్ జాబితా తయారీపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని కలెక్టర్‌లు, ఎస్పీలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పాల్గొన్న కలెక్టర్ రాజార్షిషా మాట్లాడారు. త్వరలో గ్రామ పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహించనున్న నేపథ్యంలో సజావుగా ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతున్నామన్నారు. 3 విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా, ప్రతీ ఫేజ్‌లో ఏ మండలాల్లో ఎన్నికలు జరగాలో ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు. పాత పద్ధతిలో రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నందున, సెప్టెంబరు 2న విడుదల చేసిన పంచాయతీ తుది ఓవర్ జాబితా సంబంధించి ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి నవంబర్ 22లోపు పరిష్కరించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నవంబర్ 23న ప్రతీ గ్రామపంచాయతీకి సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఫొటోలతో కూడిన ఓవర్ జాబితా ప్రచురణ పూర్తి చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ వీసీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జడ్పీ సీఈవో రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నేరడిగొండ, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను గుడిహత్నూర్ మండలంలోని ధాంపూర్ గ్రామస్తులు, మహిళలు మర్యాద పూర్వకంగా కలిసి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆడే గజేందర్‌కు వివరించారు. కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చూస్తానని చెప్పారు. కార్యక్రమంలో రాథోడ్ రమేష్, గుండయ్య, సుమన్, మహిళలు తదితరులు ఉన్నారు. అలాగే మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ నేరడిగొండ మండల నాయి బ్రాహ్మణులు మర్యాద పూర్వకంగా కలిశారు. నాయీ బ్రాహ్మణ సంఘ భవన నిర్మాణానికి రూ.5ఐదు లక్షలు మంజూరు చేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో మండల నాయకులు ఆడే వసంత్ రావ్. తీత్రే నారాయణ్ సింగ్, తదితరులు ఉన్నారు.

వయోవృద్ధుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

» కలెక్టర్ రాజార్షిషా



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్‌లకు సముచిత గౌరవం లభించినప్పుడే సమాజం మరింత ప్రగతిశీలత సాధిస్తుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. వయోవృద్ధుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెడతామని వెల్లడించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధుల సంరక్షణ కోసం తెచ్చిన ఈ చట్టంపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వయోవృద్ధులు తమ పూర్తిఆస్తిని పిల్లలకు ఇవ్వకుండా కొంతభాగాన్ని తమ భద్రత కోసం ఉంచుకోవాలని సూచించారు. పిల్లలు సంరక్షణ చేయనిపక్షంలో కలెక్టర్ లేదా ఆర్డీఓకు దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి తిరిగి ఆస్తిని పొందే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వయోవృద్ధులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. దస్నాపూర్‌లో వయోవృద్ధుల కోసం ప్రత్యేక భవనం నిర్మించి ఇన్‌చార్జి మంత్రి ద్వారా ప్రారంభించుకున్నామని, అక్కడ డే కేర్ కేంద్రం కూడా త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. వయోవృద్ధుల సంరక్షణ టోల్‌ఫ్రీ నంబర్ పోస్టర్‌ను ఆవిష్కరించి, పలువురు వయోవృద్ధులను మెమెంటోలతో సన్మానించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించి వైద్యులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, వయోవృద్ధుల సమైక్య సభ్యులు దేవిదాస్, లక్ష్మారెడ్డి, తదితరులు ఉన్నారు.

రైతు సంఘం సమావేశంలో పాల్గొన్న బోరంచు

మావల, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్రముసాయిదా విత్తన చట్టం 2025పై తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకెట అన్వేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘాల సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఆఫీసు హాల్‌లో గురువారం జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసి విత్తనచట్టంలోని లోపాలు, రైతులు ఎదుర్కొనే సమస్యలను వివరించారు.

'చలో ఉట్నూర్‌ను విజయవంతం చేయాలి'

బజార్‌హత్నూర్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు ఉయిక సుదర్శన్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఆదివాసుల ధర్మ యుద్ధం, చలో ఉట్నూర్ పోస్టర్‌లను ఆదివాసీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈనెల 23న ఉట్నూర్ లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు దయానంద్, చందు, తదితరులు ఉన్నారు.

ఖానాపూర్ అభివృద్ధికి రూ.5 కోట్లు

» ఎమ్మెల్యే బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఉట్నూర్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు నియోజకవర్గం అభివృద్ధి నిధుల కింద రూ.5కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ ప్రకటించారు. మండలంలోని లక్కెట్టిపేటలో గ్రామాల పటేళ్లు, రాయి సెంటర్ సార్మెడిలతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి మండలానికి చెందిన అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు.మండలానికి సంబంధించిన ఆదివాసీ గ్రామాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి ఆయా గ్రామాల పటేల్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని అధికారులకు పరిష్కరించాలని సూచించారు. గ్రామాలకు వెళ్లడానికి రోడ్లు గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, మంచి నీటి సమస్యలు, విద్యుత్ సమస్యలు, ఇతర సమస్యల గురించి చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు జరిగి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతో చాలా వరకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుపడడమే కాకుండా ఆదివాసుల పైన కేసులు పెట్టడంతో ఆదివాసీ ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. సమావేశానికి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా నిర్లక్ష్య ధోరణితో తమ మాటకు విలువ ఇవ్వకుండా అటవీ అధికారులు సమావేశానికి హాజరుకాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వారిపై తగిన చర్యలు తీసుకునే విధంగా పైఅధికారులకు మంత్రికి ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. అంతకుముందు గ్రామానికి చేరుకోగానే హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి కుడ్మేత మనోహర్

సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి

ఇంద్రవెల్లి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): కార్డియో పల్మనరి రిసస్సియేషన్ (సీపీఆర్)పై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మేత మనోహర్ అన్నారు. గురువారం మండలంలోని పాటగూడలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. పిట్టబొంగురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సీపీఆర్‌పై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సమాజంలో గుండెపోటు మరణాలు ఎక్కువయ్యాయని అన్నారు. చాలావరకు శారీరక శ్రమలేకపోవడం, మానసిక ఒత్తిడుల కారణంగా గుండెపోటు బాధితులు పెరుగుతున్నారన్నారు. ఆసుపత్రికి వచ్చినవారైనా, బయట ఎక్కడైనా వారైనా గుండెపోటుతో అపస్మారక స్థితికి వచ్చిన వారికి సీపీఆర్ చేసి మెడికల్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం సీపీఆర్‌పై 8అంశాల ప్రక్రియను గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ పూజిత, ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సౌరబ్ గౌరవ్, హెచ్ఈవో నాందేవ్, హెల్త్‌సూపర్ రాథోడ్ జలేందర్, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్ ఐటీడీఏ పీఓకు వినతి పత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బందిని నియమించాలి

ఉట్నూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిమడుగు, ఆంధోలి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గత సంవత్సర కాలం నుంచి సిబ్బందిలేక గ్రామాల్లోని పిల్లలు ఇబ్బందికి గురవుతున్నారని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్‌ను కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా ధరణి రాజేష్ మాట్లాడుతూ గతంలో పులిమడుగు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసిన టీచర్ ఉద్యోగోన్నతిపై ఇచ్చోడకు ప్రమోషన్‌పై వెళ్లడంతో పులిమడుగు అంగన్‌వాడీ కేంద్రానికి సిబ్బందిని నియమించకపోవడం సోచనీయమని పేర్కొన్నారు. అదే విధంగా ఆంధోలి గ్రామంలో కూడా అంగన్‌వాడీ టీచర్ లేకపోవడంతో పిల్లలు ఆందోళనకు గురి అవుతున్నారన్నారు. పులిమడుగు, ఆంధోలి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు ఆయా కూడా లేకపోవడం వల్ల కేంద్రాలకు తాలాలు వేసి ఉంటున్నాయని నియమకాలు చేపట్టి పిల్లల కష్టాలు తీర్చాలన్నారు. కార్యక్రమంలో బాబా శ్యాం, అజ్మీర జయ చంద్ర, బొడ్డు నరేష్, బాలాజీ, కుమ్ర కోటేష్, సాజిద్ సిద్ధిక్ ఉన్నారు.

ఆదివాసీ ధర్మయుద్ధం సభను విజయవంతం చేయాలి

భీంపూర్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): హలో ఆదివాసీ చలో ఉట్నూర్ సభను విజయవంతం చేయాలని మండలకేంద్రం భీంపూర్‌లో గురువారం తుడందెబ్బ మండల అధ్యక్షుడు సీడం పురుషోత్తం, నాయకులు మెస్రం తెలంగ్‌రావు, వెట్టి మనోహర్, మనోహర్ మహాజన్‌ల ఆధ్వర్యంలో గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ గత ముప్పై సంవత్సర నుంచి ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని పోరాటం చేస్తున్నామని అందులో భాగంగా 23న ఉట్నూర్‌లో నిర్వహించే ఆదివాసీ ధర్మ యుద్ధం సభను విజయవంతం చేయాలని, అలాగే ఆదివాసీ యువతి యువకులు, మహిళలు పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మడావి పాండురంగ్, మెస్రంసోమేష్, మడావి లింబాజి, సీడం మాణిక్ రావు, సీడం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం కోరారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో 76వ భారత రాజ్యాంగ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. ఈ నెల 26న జరగనున్న రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే జితేందర్, ప్రధాన కార్యదర్శి కాంబ్లే మారుతి, నాయకులు సోమోరే నాగోరావు, భీం ఆర్మీ మండల అధ్యక్షుడు సూర్యవంశీ ఉత్తం, కాంబ్లే ఉత్తం, సావంత్ లహుదాస్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

నేరడిగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బ్యాటరీ స్ప్రేలతోపాటు పవర్ స్ప్రేయర్లు సీడ్ ఫెర్టిలైజర్ డ్రీల్, కల్టివేటర్, ఎంబీ నాగలి కేజ్‌వీల్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మొక్కజొన్న సెంటర్ పవర్ విడర్ బుష్ కట్టర్, పవర్‌టిల్లర్లు సైతం అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే రైతు పేరు మీద భూమి నమోదు ఉండాలని, దరఖాస్తుదారుడు పట్టాదారు పాస్‌బుక్ ఆధార్‌కార్డు ట్రాక్టర్ పరికరాల కోసం ట్రాక్టర్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. సన్న చిన్నకారు మహిళా ఎస్సీ, ఎస్టీ రైతులకు 50శాతం సబ్సిడీ మిగతా వారికి 40శాతం సబ్సిడీపై ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ ధికారిని సంప్రదించాలని తెలిపారు.

సోయా కొనుగోలు నిబంధనల్లో సడలింపు ఇవ్వాలి

ఆదిలాబాద్‌టౌన్/భైంసా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోయా కొనుగోలు నిబంధనల్లో ప్రత్యేక సడలింపు ఇవ్వాలని సీఎం, రేవంత్‌రెడ్డితో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు గురువారం న్యూఢిల్లీలో కేంద్రవ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి విన్నవించారు. ఆదిలాబాద్ జిల్లా సోయా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అతివర్షాలు, అనుకూల వాతావరణం లేని కారణంగా ఆదిలాబాద్ జిల్లాలో సోయా గింజలు పూర్తిగా రంగు మారాయని, కేంద్ర నిల్వ సంస్థలు ఈ పంటను కొనుగోలు చేయడానికి నిరాకరిస్తున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుత సీజన్‌కు మాత్రమే ఎఫ్ఏక్యూ నిబంధనల్లో ప్రత్యేక సడలింపు ఇచ్చి, రంగు మారిన సోయాను వెంటనే కొనుగోలు చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని మంత్రిని కోరారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి, అవసరమైన సడలింపు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్ ఉన్నారు.



కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గిరిగ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు విడుదల

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల్లో నిరుపేద కుటుంబాల పండగలు, పెళ్లిళ్ల కోసం షెడ్ల నిర్మాణంతోపాటు నాలుగు గిరిజన భవనాల నిర్మాణం కోసం రూ.5.99 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిగ్రామాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం ఇటీవల గిరిజన శాఖ మంత్రి అడలూరి లక్ష్మణ్ కుమార్‌కు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. వీటిద్వారా గిరిగ్రామాల రూపురేఖలు మారనున్నాయని పేర్కొన్నారు.

మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎల్లుల భోజన్న, కార్యదర్శి మేకల అశోక్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాజన్న, సురేష్, చిన్న నర్సిములు, ఆశన్న పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత కార్డియాలజీ శిబిరం

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా రిమ్స్ నుంచే అన్ని అవసరమైన వైద్యసేవలు అందించేలా సమర్థమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో అపోలో, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చిన్నారుల ఉచిత గుండె జబ్బుల వైద్యశిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. రిమ్స్‌లోని డీఈఐసీ కేంద్రంలో హైదరాబాద్ అపోలో కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పీడియాట్రిక్ కార్డియాలజీ శిబిరానికి ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 150మంది చిన్నారులు హాజరయ్యారు. వైద్యులు వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సల నిమిత్తం హైదరాబాద్‌కు రావాలని సూచించారు. హైదరాబాద్‌కు పంపేలా వ్యవస్థను రూపొందించాలని, అవసరమైతే ఆస్పత్రి యాజమాన్యానికి లేఖరాసి, రిమ్స్‌లోనే పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ కాలనీలో రక్తదాన శిబిరం

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): టిప్పు సుల్తాన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక భగత్ సింగ్ కాలనీలో హెల్పింగ్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్‌తోపాటు అజాద్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు షకీల్ ముఖ్య అతిథులుగా హాజరై టిప్పు సుల్తాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెల్పింగ్ యూత్ అధ్యక్షుడు అన్వర్, షైల, షారూఖ్, అర్బాజ్, రోహిత్, అర్బాత్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల సేవలను సద్వినియోగించుకోవాలి

తలమడుగు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా కోపరేటివ్ సొసైటీ ఇన్‌స్పెక్టర్ సరిత అన్నారు. సహకార వారోత్సవాల ముగింపు సందర్భంగా తలమడుగు మండల ప్రాథమిక సహకార సంఘంలో ఉమ్మడి జిల్లా సీనియర్ కోపరేటివ్ ఇన్‌స్పెక్టర్ సవిత ఆధ్వర్యంలో సంఘంలో రైతులకు సంఘం ద్వారా చేపడుతున్న నూతన ఆవిష్కరణలను వివరించారు. ఈ సందర్భంగా కోపరేటివ్ సీనియర్ ఇన్స్పెక్టర్ సవిత మాట్లాడారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈఓ మోతే శ్రీనివాస్, డైరెక్టర్లు ప్రతాప్, మణిరం జాదవ్, సిబ్బంది సాగర్, ఏఈఓ స్ఫూర్తి, రమాకాంత్, బీమ్ రావ్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఇన్‌స్పెక్టర్ సరిత

ఇండస్ట్రియల్ పార్కులో అక్రమాల బాగోతం

(5వ పేజీ తరువాయి...)

చెబుతున్నారు. ఇండస్ట్రియల్ పార్కు భూములపై పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి అక్రమాలకు అడ్డుకట్ట వేస్తే కోట్ల విలువైన భూములకు భద్రతా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులే చూసీచూడనట్లు వ్యవహరించడంతో అక్రమాలకు అడ్డు అదుపే లేకుండా పోతోంది.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగురామన్న

భోరజ్ ధర్నాను విజయవంతం చేయాలి

» మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): పంట కొనుగోళ్లలో విధిస్తున్న నిబంధనల కారణంగా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, నిబంధనలను సడలించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న భోరజ్ ధర్నాను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. రైతుల పక్షాన చేపట్టనున్న చలో భోరజ్ ధర్నాను విజయవంతం చేయాలని స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియాసమావేశంలో ఆయన పిలుపునిచ్చారు. ధర్నాలో కాంగ్రెస్, బీజేపీ మినహా రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు పాల్గొననున్నాయని పేర్కొన్నారు. ఈనెల 21న హాలో రైతన్న చలో భోరజ్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంట కొనుగోళ్ల విషయంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నూతన నిబంధనలు తెచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నాయని మండిపడ్డారు. వీటి కారణంగా రైతులకు మద్ధతు ధర దక్కడం లేదని, తక్కువ ధరకే ప్రైవేట్‌కు అమ్ముకుని నష్టపోతున్నారని అన్నారు. పత్తిరైతులకు అండగా చేపట్టనున్న ధర్నాకు రైతులు పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు న్యాయం చేయనిపక్షంలో మరింత ఉధృతంగా పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు.

ధర్నాను విజయవంతం చేయండి..

తలమడుగు: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదిలాబాద్ నియోజకవర్గంలోని భోరజ్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ తోట వెంకటేష్ కోరారు. ఈ సందర్భంగా మండలంలోని కుచలాపూర్ గ్రామంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్య క్రమంలో అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, నాయకులు రామ్‌కిషన్ ఉన్నారు.

రిమ్స్‌లో అన్నదానం

ఆదిలాబాద్ టౌన్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత వసంతాల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే రిమ్స్‌లోని సత్యసాయి నిత్యాన్నదానసత్రంలో అన్నదానం చేపట్టారు. రిమ్స్ రోగులకు, వారి సహాయకులకు అందించే టోకెన్‌ల ప్రకారం అన్నదానం చేస్తుండగా ఈనెల 23 వరకు ఎలాంటి టోకెన్ లేకుండా భోజనాలు వడ్డిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు విలాస్, సల్ల విజయ్ బాబు, వైకుంఠపతి, సత్యనారాయణ, యాదవ్, లంకహన్మండ్లు పాల్గొన్నారు.

టీచర్లు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బజార్‌హత్నూర్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్ల, కార్మికుల, సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు, రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమావేశంలో మాట్లాడారు.

బాల్య వివాహాలపై అవగాహన



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భైంసా రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భైంసా మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో విజన్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై ఎంపీవో ప్రదీప్ కుమార్, విజన్ సంస్థ ఆర్గనైజేషన్ అనురాధ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఎంపీవో ప్రదీప్ కుమార్ మాట్లాడు తూ బాల్య వివాహాలు లేని గ్రామాలుగా తీర్చి దిద్దవల సిన బాధ్యత అందరిపైన ఉంది. కావున గ్రామ స్థాయిలో పంచాయతీ కార్య దర్శులు బాల్య వివాహాలు జరగకుండా ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. విజన్ సంస్థ సిబ్బంది అనురాధ మాట్లా డుతూ బాల్య వివాహం నిషేధ చట్టం ప్రకారం అమ్మాయిలకు 18 ఏళ్లు నిండి ఉండాలని అన్నారు. అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండి ఉండాలని అన్నారు. ఆలోపు పిల్లలకు వివాహం జరిపిస్తే చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 ప్రకారం లక్ష రూపాయల జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్ష విధించారన్నారు. బాల్య వివాహాలు మీ గ్రామంలో గాని చుట్టు పక్కల గాని లేదా మీ పరిసర ప్రాంతంలో గాని జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1098కి కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలు

» ముథోల్ బీఆర్ఎస్ ప్రతినిధి డా. కిరణ్ కోమ్రేవార్

భైంసా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా.కిరణ్ కోమ్రేవార్ ఆరోపించారు. గురువారం ఈ - కార్ రేసింగ్ కేసులో కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అనుమతించిన సందర్భాన్ని పురస్కరించుకొని పత్రిక ప్రకటనను విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలను వేధించడం, ప్రశ్నించే వారి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ లబ్ది కోసమే రేవంత్ రెడ్డి సర్కార్ కుట్రపూరిత ధోరణి విధానాలను అవలంబిస్తోందన్నారు. కక్ష సాధింపు చర్యలతో నియంత్రించాలనుకోవడం అవివేకమైన చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు దుశ్చర్యలకు పాల్పడుతోందన్నారు. పార్టీ శ్రేణులన్నీ కేటీఆర్‌కు అన్నివిధాలుగా అండదండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

» మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆనంద్‌రావు

ముథోల్, నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి) : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి లబ్ది పొందాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన ముథోల్‌లోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వరి మేలు రకం క్వింటాల్‌కు రూ. 2,389, సాధారణ రకం రూ.2,369 లకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏపీఎం గురుచరణ్, డైరెక్టర్ సుదర్శన్, ఐకేపీ సీసీలు లక్ష్మణ్, గంగాధర్, గోదావరి, నాయకులు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలి

» ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావ్ పాటిల్



నారాయణరావ్ పాటిల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న దృశ్యం

భైంసా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం బాధ్యతాయుతమైన విధానాల ద్వారా అంకిత భావంతో కృషి చేస్తున్నామని ముథోల్ మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బోస్లే నారాయణరావ్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో తానూర్ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఆలయాల నిర్మాణాలు పునర్నిర్మాణాలు, భక్తులకు వసతులు,సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. రైతన్నల పంట చేలకు సజావుగా రాకపోకలు చేపట్టేందుకు వీలుగా లక్షలాది రూపాయలతో పొలం బాటల నిర్మాణాలను అధికంగా చేపడుతున్నట్లుగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావ్ నేతృత్వంలో నియోజక వర్గ పరిధిలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు గాను చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని వివరించారు.ప్రభుత్వం సాగునీటి కల్పన వ్యవస్థ మెరుగుదల కోసం గాను విరివిగా నిధులు కేటాయిస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకవచ్చేందుకు గాను అధిక మొత్తంలో నిధులను మంజూరు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా తానూర్ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరగా వారికి ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ కండువా వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, బెజ్జంకి ముత్యం రెడ్డి, మిర్జాపూర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యామరావ్ పాటిల్, కుంటాల మాజీ ఎంపీపీ సయ్యాజీ భోజరామ్ పాటిల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు వరం సీఎంఆర్ఎఫ్

కుభీర్: ముఖ్యమంత్రి సహాయనిధి బాధిత కుటుంబానికి వరమని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ్‌రావు పాటిల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఇటీవలే మృతి చెందిన కమల్‌దాస్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయిన రూ. 50వేలు చెక్కును అందజేశారు. అనంతరం కమల్‌దాస్ కుమారుడి చదువు కోసం రూ.20వేల నగదును అందించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు మండల కేంద్రానికి చెందిన సంఘి రాజేశ్వర్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇటీవల పదవి విరమణ పొందడంతో ఆయనకు శాలువ పూలమాలతో ఘనంగా సత్కరించారు.

గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సన్మానం



మామిడి నారాయణ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

లోకేశ్వరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన మామిడి నారాయణ రెడ్డి మాజీ ఎంపీపీ, అడెల్లి పోచమ్మ దేవస్థానం డైరెక్టర్‌గా ఎంపికైన సందర్భంగా గురువారం ధర్మోర గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేకల సాయేందర్, సాయన్న, బుచ్చన్న, ప్రశాంత్, గంగాధర్, లస్మన్న, సాయన్న, ముత్యం, చిన్నయ్య, చిన్నగంగాధర్, గంగారాం, సాయన్న పాల్గొన్నారు.

ఖేలో ఇండియా ఎంపిక వాల్‌పోస్టర్ల విడుదల

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండి యా ఆధ్వర్యంలో నేటి నుంచి జిల్లాలో నిర్వహించబోయే బాలికల అండర్- 14, అండర్- 16 ఖేలో ఇండియా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ ఎంపిక పోటీలకు సంబంధించి వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం సాయంత్రం తన ఛాంబర్‌లో విడుదల చేశారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థుల్లో నైపుణ్యాలు దాగి ఉన్నాయని, ఇటువంటి పోటీల ద్వారా వాటిని వెలికి తీయాలన్నారు. ఎంపిక పోటీలు పకడ్బందీగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ ఎంపిక పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో భోజన్న, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ శ్యాముల్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, గిరిప్రసాద్, తదితరులు ఉన్నారు.

ఎన్ఐఆర్ అడ్వైజరీ కమిటీ ఆధ్వర్యంలో బేగంపేటలో సమావేశం



బేగంపేటలో సంప్రదింపుల సమావేశం

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న ఓవర్సీస్ మొబిలిటీ (ఫెసిలిటేషన్ అండ్ వెల్ఫేర్) బిల్లు - 2025 ముసాయిదాపై అభిప్రాయాలు సేకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ ఆధ్వర్యంలో బేగంపేటలో గురువారం ప్రత్యేక సంప్రదింపుల సమావేశం జరిగింది. కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వలసల నిపుణులు, పరిశోధకులు, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు, అధికారులు, మేధావులు పాల్గొని బిల్లుపై తమ సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవాణి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... రేవంత్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఇప్పటికే పలు చర్యలు చేపట్టిందన్నారు. కేంద్ర చట్టంలో కూడా తెలంగాణ ఎన్ఆర్ఐలకు ప్రయోజనం కలిగే విధంగా నిబంధనలు ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నిర్మల్ జిల్లా నుండి ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ సభ్యుడు స్వదేశ్ పరికి పండ్ల, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి పాల్గొన్నారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ చర్యలు, ఒప్పంద వ్యవస్థలో మార్పులు వంటి అంశాలపై వారు పలు సూచనలు కమిటీకి సమర్పించారు.

ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి



ఉపకార వేతన దరఖాస్తుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ముథోల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ విద్యా యోజన పథకంలో భాగంగా ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలకు 9వ, 10వ ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎడబిడ్, ముథోల్ వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులు ఆర్. నగేష్, శారదలు అవగాహన కల్పించారు. గురువారం ముథోల్, తానూర్ మండలంలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ, 10వ తరగతి చదువుతున్న ఎస్సీ విద్యార్థులు ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. ఆయా పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. తగిన గడువు సమయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

» ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్



పొన్నల్ వద్ద సదర్మాట్ బ్యారేజీని పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీరింగ్ శ్రీనివాస్

మామడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సదర్మాట్ బ్యారేజీలో మిగిలిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో గల గోదావరి నదిపై నిర్మిస్తున్న నూతన బ్యారేజీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంబంధించిన పనులు పూర్తి కాలేవని డిసెంబరులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపర్ ఇన్‌టెండింగ్ ఇంజనీర్ రాజేంద్ర ప్రసాద్, డీసీఈ మధు సూదన్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్ జాదవ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేందర్ రాథోడ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

విజయవంతంగా ఝాడు యాత్ర

నిర్మల్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాలుగు రోజులుగా నిర్వహించిన చలో ఝాడు యాత్ర విజయవంతంగా ముగిసిందని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రియదర్శిని నగర్, సాగర్ కాలనీలో పార్టీ కార్యకర్తలు గడప గడపకు వెళ్లారు. ఈ సందర్భంగా వారు స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రజల నుంచి నేరుగా తెలుసుకున్న సమస్యలన్నింటిని పరిష్కారం కోసం త్వరలోనే సంబంధిత అధికారులకు, ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సిహెచ్. వినోద్ కుమార్, యాకిన్, సోఫి ఇలియాస్, షేక్ ఇమామ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

లోకేశ్వరం, నంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొడిసెరా గ్రామంలో శనివారం ఉదయం 11 గంటలకు ముథోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ నూతన గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం కోసం అర్లీ - గొడిసెరా గ్రామానికి రావడం జరుగుతుంది. కావునా శనివారం ఉదయం 11 గంటలకు మండల బీజేపీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, బీజేపీ సియర్ నాయకులు అందరూ హాజరు కావాలని కోరారు.

పాఠశాల పైకప్పుకు రంధ్రాలు

▸▸ పాఠశాల పైకప్పుకు రంధ్రాలు ▸▸ వర్షం పడితే పాఠాలకు ఇబ్బందులు


పొట్టపెల్లి(కే)లో పాఠశాల పైకప్పుకు రంధ్రాలు పడిన దృశ్యం

లక్ష్మణచాంద,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పైకప్పుకు పెద్ద పెద్ద రంధ్రాలు పడ్డాయి. చాలా సంవత్సరాల క్రితం ఈ పాఠశాల పైకప్పు సిమెంటు రేకులతో వేశారు. చాలాకాలం గడిచిపోయినందున ఈ రేకులకు పెద్దపెద్ద రంధ్రాలు పడ్డాయి. అక్కడక్కడ చాలా చోట్ల పగుళ్ల ఏర్పడి ఉన్నందున వర్షం కురిసినప్పుడు వర్షపు నీరు గదులలోకి జారి విద్యార్థుల పాఠాల బోధనకు అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆపాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు గురువారం వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పైకప్పును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య


బోడ్కర్ నారాయణ(ఫైల్)

నర్సాపూర్(జి),నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తురాటి గ్రామానికి చెందిన ఓవృద్ధుడు కంటి ఆపరేషన్ విఫలమవడం, నరాల నొప్పితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తురాటి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి నర్సాపూర్(జి) పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తురాటి గ్రామానికి చెందిన బోడ్కర్ నారాయణ(68) నాలుగు నెలల క్రితం కంటి ఆపరేషన్ చేయించుకున్నారు. ఆపరేషన్ చేయించుకున్నప్పటికీ కంటి చూపు తిరిగి రాకపోగా, కళ్ల నరాలు విపరీతంగా నొప్పి పెట్టడం మొదలైంది. ఈ క్రమంలో వృద్ధాప్య సమస్యలు, దృష్టి లోపం, నరాల నొప్పితో విసిగి పోయిన నారాయణ జీవితంపై విరక్తి చెంది తీవ్ర నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 18వ తేదీన తెల్లవారు జామున తన ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. పురుగుల మందు తాగిన విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం ఆయనను నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. మృతుడి కుమారుడు బోడ్కర్ శ్రీకర్ ఇచ్చిన దరఖాస్తు మేరకు నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసును ఏఎస్సై శంకర్ నమోదు చేసి, పూర్తి వివరాల కోసం విచారణ చేపట్టినట్లు తెలిపారు

బంగారిగూడలో కార్డెన్ సెర్చ్

▸▸ 60 ద్విచక్ర వాహనాలు, 10 ఆటోలు, 2 మ్యాక్స్‌లు స్వాధీనం
▸▸ అక్రమంగా మద్యం అమ్ముతున్న 3 బెల్ట్ షాపుల జప్తు
▸▸ అసాంఘిక కార్యకలాపాల నిర్వహణ చట్టరీత్యా నేరం
▸▸ 70 మంది సిబ్బందితో ఉదయం 5 గంటల నుంచి తనిఖీలు
▸▸ ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్


మాట్లాడుతున్న ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్

ఆదిలాబాద్‌రూరల్/బజార్‌హత్నూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):ప్రజలరక్షణ, సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్‌సెర్చ్)లను నిర్వహించడం జరుగుతుందని ఏఆర్‌డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్ తెలిపారు.గురువారం ఆదిలాబాద్ మండలంలోని బంగారు గూడలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 5గంటల నుంచి 70మంది సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్‌ను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరైన ధ్రువ పత్రాలు లేనటువంటి 60 ద్విచక్ర వాహనాలు, 10ఆటోలు, రెండు మ్యాక్స్ వాహనాలను తాత్కాలికంగా స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. చట్టవిరుద్ధంగా అక్రమమద్యం అమ్ముతున్నటువంటి మూడు బెల్ట్ షాపులను జప్తు చేయడం జరిగిందని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండాలని సూచించారు.యువత వాహనాలలో ప్రయాణించేటప్పుడు రోడ్డుభద్రత నియమాలు పాటించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేస్తూ వాటి ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ఉండాలని ఎలాంటి గృహహింస చర్యలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. రాత్రి సమయాల్లో అనవసరంగా తిరగరాదని,ఈవిటీజింగ్, మహిళలను వేధించడంలాంటివి నిర్వహించకూడదని, గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఫణిధర్, నాగరాజు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మురళీ, చంద్రశేఖర్, రూరల్ ఎస్సై విష్ణువర్ధన్, ఎస్సైలు రాధిక, జీవన్‌రెడ్డి,రాకేష్ సిబ్బంది పాల్గొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్‌సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామని డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. బజార్‌హత్నూర్‌ మండలం లోని చందు నాయక్ తండాలో డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీఐగురుస్వామి, ఎస్సైలు సంజయ్‌కుమార్, సాయి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై అత్యవసర సేవల వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయని వాటిని అడ్డు కోవడం చట్టప్రకారం నేరంగా పరిగణించబడుతుందని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. యువత కేసుల బారిన పడకుండా వారి భవిష్యతులను నాశనం చేసుకోకూడదని తెలిపారు. అంబులెన్స్, అగ్నిమాపక, వాహనాలు ఆస్పత్రిలకు వెళ్లేవారికి అసౌకర్యం కలిగే చర్యలు చేయ వద్దన్నారు. యువత కేసుల వల్ల ఉద్యోగ అవకాశాలను కోల్పోకుండా ఉండాలని సూచించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరూ స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ధారించుకొని ఉన్నతంగా ఎదగాలని ఆదిలాబాద్ జిల్లాకలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చదవడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సాధించవచ్చని పేర్కొన్నారు.జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలోని రీడింగ్ రూమ్ పనులను వేగవంతం చేసి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఐటీడీఏ ఉట్నూర్‌లో గ్రంథాలయ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, జిల్లా కేంద్రంలో నూతన గ్రంథాలయ భవనం నిర్మాణం కోసం కూడా ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు.ఈజిల్లా తనకు గోల్డెన్ మూమెంట్స్‌ను అందించిందని భావోద్వేగ పూరితంగా తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. జిల్లా గ్రంథాలయం అభివృద్ధికి కొత్త ప్రతిపాదనలు పంపితే నూతన భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందించి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తానని పేర్కొన్నారు. అంతకుముందు సామల సదాశివ మాస్టర్ చిత్రపటాన్నికలెక్టర్,ఎమ్మెల్యే, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య ఆవిష్కరించి నివాళులర్పించారు.కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డిబోజారెడ్డి,పాఠకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లాకలెక్టర్ రాజర్షిషా సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధి కారి మిల్కా, డీసీపీఓ రాజేంద్ర ప్రసాద్, సీడ బ్యూసీ ప్రతినిధులు వెంకట స్వామి,హెచ్‌ఎం సమీ టర్, సెక్టోరల్ అధికారి ప్రత్యూష,టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

గజిటెడ్ అధికారి సంతకం కోసం నానా తిప్పలు

నేరడిగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కుల ధ్రువీకరణ పత్రం, ఏదేని ప్రభుత్వఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే దరఖాస్తు పత్రాలపై గజిటెడ్ అధికారి సంతకం కావాల్సి ఉండగా, నేరడిగొండ మండలంలో గల గజిటెడ్ అధికారులు సంతకం చేయడానికి నిరాకరిస్తున్నారని సామాజిక కార్యకర్తసాబ్లే సంతోష్‌సింగ్ ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం మండల కేంద్రంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజిటెడ్ అధికారులు తమ దగ్గరికి ప్రభుత్వ పరమైన పత్రాలపై సంతకానికి వచ్చిన వారిపత్రాలు, వివరాలు సరిగ్గాఉన్నాయో లేవో తనిఖీ చేయాలని, సరిగ్గా ఉంటే సంతకం చేయాల్సి ఉంటుందని, కానీమేము ఈమండలానికి సంబంధించిన వారం కాదు, మాపరిధిలోకి రాదు,రేపటి రోజున ఏమైనాతప్పులు జరిగితే మాకు ఇబ్బంది అవుతుంది అని చెప్పి తప్పించుకుంటున్నారని ఇలాగజిటెడ్ అధికారులు చేతులుఎత్తేస్తుంటే సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బాక్రే లక్ష్మణ్, ఉడుగులఅభిలాష్, దావుల దినేష్ ఉన్నారు.

సాయిబాబా ఆలయంలో ఘనంగా కార్తీక దీపోత్సవం


పూజలు నిర్వహిస్తున్న లక్కడి జగన్మోహన్‌రెడ్డి


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నిర్మల్‌చైన్‌గేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని గండి రామన్న సాయిబాబా ఆలయంలో గురు వారం కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... గత 11 ఏళ్లుగా ఇక్కడి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని దీపోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం 11,116 దీపాలతో ఈకార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నామన్నారు.ఈకార్యక్రమంలో సాయి దీక్ష సేవాసమితి సభ్యులు పూదరి నరహరి, ఉప్పుల నందు, కోలశంకర్, ప్రకాష్‌గౌడ్, జనార్ధన్, జిందం గోవర్ధన్, అజయ్ కుమార్, శ్రీనివాస్, మహిళలు గంగామణి, కళ్యాణి, సునీత, నవ్య, శృతి, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మొక్కజొన్న పంట కొనుగోళ్లు

ఉట్నూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రైతులు పండించిన మొక్కజొన్న పంట కొనుగోలు బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రజామిత్ర సహకార సంఘం ఆధ్వర్యంలో రూ. 78.30లక్షల విలువగల మొక్కజొన్న పం టను వారం రోజుల్లో జోరుగా కొనుగోలు చేశారు. మండలంలోని రైతులు పండించిన మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మబొజ్జు పటేల్ ఆధ్వర్యంలో ప్రారంభించిన కొనుగోలు కేంద్రంలో రైతులకు చెందిన 3,262 క్వింటాళ్ల మొక్కజొన్నను ప్రభుత్వ మద్ధతు ధర క్వింటాలుకు రూ.2400 చెల్లిస్తూ మొక్కజొన్న కొనుగోలు చేయడం జరుగుతుందని ప్రజామిత్ర సహకార సంఘం అధ్యక్షుడు సిడాంగంగాధర్, జనరల్ మేనేజర్ సోయం జుగాధిరావులు తె లిపారు.రైతులు ఎలాంటిమోసాలకు గురికా కుండా పంట అమ్మకానికి ప్రభుత్వం కొ నుగో లు కేంద్రంఏర్పాటు చేయడం ద్వారా మేలు కలుగుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు


తలమడుగు రోడ్డు వేయించుకుంటున్న రైతులు

తలమడుగు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన రైతుల కష్టాలు మారడం లేదు. కనీసం రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న అధికారులు గానీ నాయకులగానే పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చేసేది ఏమీ లేక సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతు చేయించుకున్న రైతులు అదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రానికి చెందిన రైతులు బుధవారం ఒక్కొక్క రైతు 500 జమ చేసి పొలాలు వెళ్లేందుకు గుట్టకు రోడ్డు వేయించుకున్నారు. మండల కేంద్రం నుంచి గుట్ట మీదుగా చర్లపల్లి వరకు రోడ్డు వేయాలని పలుమార్లు రైతులు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించిన ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పండించిన పంటలో ఇంటికి తెచ్చుకుందామంటే ఇబ్బందులు పడుతున్నామని ఈ విషయమై ప్రజా ప్రతినిధులకు జిల్లా అధికారులకు ఎవరికి చెప్పిన పట్టించుకోలేదన్నారు. చేసేది ఏమి లేక రైతులంతా కలిసి ఒక్కొక్క రైతు ఒక్క 500 చొప్పున డబ్బులు జమచేసి రోడ్డువేయించుకోవడం జరిగిందన్నారు. గతంలో గుట్ట రోడ్డుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పటి వరకు నిధులు మంజూరు చే యలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇకనైనా అధికారులు స్పందించి మండల కేంద్రం నుంచి గుట్టకు బీటీరోడ్డు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఇందులో రైతులు పిడుగు వెంకన్న, కొయ్యల శివన్న, శివ, గంగారెడ్డి, సమద్, సుదంరమణ, భూమన్న పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్ష

ఆదిలాబాద్‌టౌన్,నవంబరు20(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించి కొట్టిన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.2500 జరిమానా విధిస్తూ ఎస్సీ,ఎస్టీ కోర్టు న్యాయాధికారి కుమార్ వివేక్ తీర్పును వెలువరించినట్లు జిల్లా కోర్టు లైజన్ అధికారి ఈశ్వర్‌సింగ్ తెలిపారు. తీ ర్పుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్ల డించారు.ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని బెట్టుపల్లిలోని లక్ష్మీనగర్‌లో ఓఇంట్లో కార్యక్రమం జరిపారు. భోజనాల సమయంలో అదే గ్రామానికి చెందిన పులిశంకర్,బొమ్మెల్లి శ్రీనివాస్ ఎదురెదురుగా కుర్చీలలో కూర్చున్న సమయంలో పులిశంకర్ కూర్చున్న కుర్చీని బొమ్మెల్లి శ్రీనివాస్ తన్నాడు.నాముందే కూర్చుంటావా? అంటూ కులం పేరుతో దూషించి చంపుతానని బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకుఎస్సై రాజ్ కుమార్ కేసు నమోదు చేయ గా డీఎస్పీ లక్ష్మీనారాయణ స్వామి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పదిమంది సాక్షుల్ని విచారించగా నేరం రుజువైంది. దీంతో బొమ్మెల్లి శ్రీనివాస్‌కు ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ. 2500 జరిమానా విధిస్తూ ఎస్సీ ఎస్టీ కోర్టు న్యాయాధికారి కుమార్ వివేక్ తీర్పు వెలువరించారు.

క్రైం సమాచారం

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు


గాయపడిన భూమాగౌడ్

ఖానాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన ఖానాపూర్ మండలం బాదనకుర్తి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే స్థానికులు తెలిపిన కథనం ప్రకారం..ఖానాపూర్ శాంతినగర్ కాలనీకి చెందిన కొత్తకొండ భూమాగౌడ్ అనే గీత కార్మికుడు గురువారం సాయంత్రం బాదనకుర్తి శివారులో తాటి కల్లు గీసేందుకు వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు తెగిపోవడంతో చెట్టు పైనుంచి కింద పడ్డాడు. దీంతో భూమా గౌడ్‌కు ఎడమ కాలు విరిగింది. కుడి కాలుకు సైతం తీవ్ర గాయాలు అవ్వగా, తలకు, చేతులకు పలుచోట్ల గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన భూమాగౌడ్‌ను వెంటనే ఖానా పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ భూమాగౌడ్‌కు ప్రథమ చికిత్స అందించిన వైద్యుడు ఉన్నత వైద్యం కోసం నిర్మల్‌కు రిఫర్ చేసినట్లు స్థానికులు తెలిపారు. గీత కార్మిక వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న భూమాగౌడ్ కాలు విరగడంతో ఉపాధిని కోల్పోయాడని, ప్రభుత్వం ఆదు కోవాలని స్థానికులు కోరారు.

నిర్మల్ బైపాస్ రోడ్డులో లారీ బోల్తా

▸▸ 30 అడుగుల లోతులోకి దూసుకెళ్లిన బొగ్గులారీ
▸▸ ఒకరు మృతి మరో ముగ్గురికి తీవ్ర గాయాలు


లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్,మృతుడు షేక్ నిజార్(ఫైల్)

ఇచ్చోడ, నవంబరు, 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై నుంచి 30 అడుగుల లోతులో పడ్డలారీ సంఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన ఇచ్చోడ మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ రోడ్డులో నాలుగు వరుసల జాతీయ రహదారిపై గురువారం అర్థరాత్రి 2గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి నాందేడ్‌కు బొగ్గులోడుతో వెళ్తున్న లారీ ఆకస్మాత్తుగా రోడ్డుపైనుంచి కిందికి దూసుకెళ్లి బోల్తాపడింది. లారీలో ప్రయాణిస్తున్న నలుగురిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా..మరో ముగ్గురు గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈవిషయం తెలుసుకున్న పోలీసులు, 108 అంబులెన్స్ సిబ్బంది రాత్రి సంఘటన స్థలానికి చేరుకొని లారీలో ఉన్న వారిని బయ టకు తీసే ప్రయత్నం చేశారు.30అడుగుల ఎత్తునుంచి పడ్డలారీని బయట కు తీసేందుకు అర్ధరాత్రి ఎక్స్‌కవేటర్ క్రేన్‌సహాయంతో తెల్ల వారు జాము వరకు శ్రమించి లారీలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తప్పించారు. లారీలో ప్రయాణిస్తున్న షేక్‌నిజార్‌మృతిచెందగా ఆయనతో పాటు లారీలో ప్రయాణిస్తున్న ప్రహ్లాద్, రాంకిషన్,షేక్‌అహ్మద్‌లకు తీవ్రగాయాలయ్యాయి.

బస్సుల సంఖ్య పెంచాలి


బోథ్ ఎక్స్ రోడ్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

బోథ్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులకు పరీక్షలు ప్రారంభంకావడంతో బస్సుల్లోరద్దీ పెరిగింది.మరోవైపు ఆదిలాబాద్ డిపో నుంచి రావాల్సిన రెండు బస్సులు రద్దు కావడంతో బోథ్‌కు వచ్చే ప్రభుత్వ ఉద్యోగులు వివిధ పనులపైన వచ్చేవారికి తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆదిలాబాద్ నిర్మల్ నుంచి వచ్చేవారు బోథ్‌క్రాస్‌రోడ్ వద్ద ప్రయాణికులు రావడంతో ఇబ్బందులు పడుతున్నావని ప్రయాణికులు అంటున్నారు. విద్యార్థులరద్దీని పరిగణలోకి తీసుకొని బస్సుల సంఖ్యను పెంచా లని కోరుతున్నారు . లేకుంటే ప్రయాణికులు తీవ్రఇబ్బందులకు గురయ్యే స్కారం ఉంది.

గుంతలమయంగా ఘన్‌పూర్ రోడ్డు


గుంతలతో నిండిన ఘన్‌పూర్ రోడ్డు

ఉట్నూర్,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్ రహదారి గుంతల మయం కావడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడతున్నారు. ఆర్ అండ్ బీ రహదారి నుంచి ఘన్ పూర్ వరకు ఉన్నమట్టి రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతల మయం కావడంతో ద్విచక్ర వాహనదారులతోపాటు జీపులు, ఆటోల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. మూడున్నర కిలోమీటర్ల రోడ్డును కంకర రోడ్డుగా నిర్మించడానికి అటవీ శాఖ అడ్డంకులు తెలుపుతుండడంతో ఐదుద శాబ్దాల కంటే ముందు ఏర్పడిన ఘన్‌పూర్ గ్రామానికి సైతం పక్క రోడ్డు నిర్మాణానికి అడ్డం కులు ఏర్పడుతుండడంతో అటవీశాఖ చర్యల పట్ల గిరిజనులు అసం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేసి ప్రజలను ఇబ్బందుల నుంచి కాపాడాలని కోరుకుంటున్నారు.

డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో రోడ్డు ప్రమాదాల నివారణ

భైంసా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు డిఫెన్సివ్ డ్రైవింగ్ విధానాలను అవలంబిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించబడుతామని భైంసా టౌన్ సీఐ గోపినాథ్ పేర్కొన్నారు. గురువారం భైంసా పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ విధానాలపై అవగాహన సదస్సులు నిర్వహించి మాట్లాడారు. ప్రమాదాలను అరికట్టేందుకు గాను వాహన చోదకులు పాటించాల్సిన నిబంధనలు, జాగరుకత విధానాలు, అప్రమత్త చర్యలను వివరించారు. ఇందులో టౌన్ పోలీసులు, ఆయా ప్రాంతాలవాసులు పాల్గొన్నారు.

తెలంగాణ కశ్మీరం... ఆదిలాబాద్ అటవీ చిత్రం..









తెలంగాణా కశ్మీరంగా గుర్తింపు పొందిన ఆదిలాబాద్ జిల్లాలో అటవీ అందాలకు కొదవే లేదు. శీతాకాలంలో దట్టమైన పొగమంచుతో కూడిన దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను కట్టి పడేస్తున్నాయి. రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ప్రాంతాల్లో జిల్లా ఒకటి కాగా వేకువజామున ఆదిలాబాద్ పట్టణంలోని శివారు ప్రాంతాల్లో పొగమంచుకప్పేసి కశ్మీరాన్ని తలపిస్తున్నాయి.అటవీ క్షేత్రాల్లోనూ పొగమంచు మాటున దాగిన పచ్చదనం తివాచీ పరిచినట్లు చూపరులకు చూపు తిప్పుకోనివ్వడం లేదు.

- ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.7, కనిష్ఠం 14.8



పంటల కొనుగోళ్లు
పకడ్బందీగా సాగాలి

▸▸ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటల కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంటల కొనుగోలు ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి, సోయా, పత్తి, మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించి, కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 14,760.56 క్వింటాళ్ల వరి ధాన్యం, 5,746 క్వింటాళ్ల సోయా, 7,715 క్వింటాళ్ల మొక్కజొన్న, 66,140 క్వింటాళ్ల పత్తి పంటను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. తగు తేమ శాతం వచ్చిన తరువాతే రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తుందని తెలిపారు. 7 క్వింటాళ్లకు మంచి దిగుబడి వచ్చిన రైతులు తమ వివరాలను మండల వ్యవసాయ అధికారుల ద్వారా నమోదు చేయించి, పంట ఉత్పత్తి పరిశీలన



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

చేపట్టించుకోవాలన్నారు. ఆ వివరాలను కొనుగోలు కేంద్రాలకు అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లా మొత్తం 351 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యానికి వంద శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలని, ప్రతీ కేంద్రంలో ప్యాడి క్లీనర్లను ఉపయోగించాలని సూచించారు. కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పత్తి రైతుల సౌకర్యార్థం 1800 599 5779 టోల్ ఫ్రీ నెంబర్, 88972 81111 వాట్సాప్ నెంబర్లు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, మార్కెటింగ్ అధికారి గజానంద్ తో పాటు సీసీఐ, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ అభినవ్‌కు ఘనస్వాగతం

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 18వ తేదీన జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్. పాటిల్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక 'జల సంచాయ్ - జన భాగీధారి' అవార్డును స్వీకరించి గురువారం కలెక్టరేట్‌కు వచ్చిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు కార్యాలయం ప్రధాన గేటు వద్ద అధికారులు పూలమాలలు, బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. పలువురు అధికారులు కలెక్టర్‌కు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి జల అవార్డుల్లో భాగంగా దక్షిణాది రాష్ట్రాల విభాగంలో నిర్మల్ జిల్లా రెండవ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. జిల్లాకు కోటి రూపాయల రికార్డు లభించడం విశేషమని తెలిపారు. జిల్లాకు ఇంతటి ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో పాటు అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్‌ను అభినందిస్తున్న అధికారులు



కబ్జాకు గురవుతున్న భైంసా మండలం కామోల్ గ్రామంలోని పోచమ్మ చెరువు ఇదే



నిర్మల్ మండలంలో కబ్జాకు గురవుతున్న కొండాపూర్ చెరువు ఇదే

ఇక లెక్క పక్కా!

▸▸ ఇరిగేషన్ అధికారుల నజర్
▸▸ జిల్లాలో 659 చెరువులు
▸▸ తూములు, కాలువలు, అలుగులపైనా ఆరా
▸▸ వాటి స్థితి గతులను తెలుసుకునేందుకు రంగంలోకి దిగిన అధికారులు
▸▸ తుది దశలో నివేదికలు

నిర్మల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇరిగేషన్ శాఖ పరిధిలోని చెరువులపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఆ చెరువుల పరిస్థితులు ఎలా ఉన్నాయోననే అంశంతో పాటు వాటి పరిధిలోని కాలువలు, తూములు, అలుగులతో పాటు చెరువుల కట్టలపై ఇరిగేషన్ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. అయితే అధికారుల సర్వేలో ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూస్తున్నట్లు చెబుతున్నారు. కొన్ని చోట్ల చెరువుల రూపురేఖలే మారిపోయాయని అంటున్నారు. కబ్జాల కారణంగా చెరువుల రూపు రేఖలు మారిపోయాయని అంటున్నారు. దీంతో పాటు చాలా చోట్ల తూములు, అలు గులు, కాలువలు సైతం కబ్జాలకు గురయ్యాయని పేర్కొంటున్నారు. అధికారుల సర్వే పూర్తయినట్లయితే జిల్లాలోని మొత్తం చెరువుల సంఖ్యతో పాటు వాటి స్థితి గతులు, మరమత్తులకు సంబంధించిన వివరాలు వెల్లడి కానున్నాయని అంటున్నారు.

జిల్లాలో 659 చెరువులు..

కాగా నిర్మల్ జిల్లాలో ఇరిగేషన్ శాఖ పరిధిలో మొత్తం 659 చెరువులు ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ చెరువుల కింద దాదాపు 80వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఈ మొత్తం ఆయకట్టుకు ప్రస్తుతం సాగునీరు అందుతున్నట్లు చెబుతున్నప్పటికి వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అంటున్నారు. కాగా అధికారులు ఇప్పటి వరకు 550కి పైగా చెరువులను సందర్శించి వాటి స్థితి గతులను తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ 550 చెరువులకు సంబంధించి నివేదికలను సైతం రూపొందించడంలో అధికారులు నిమగ్నమయ్యా రు. గత ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ పథకం కింద ఎంత మేర మరమత్తులు జరిపారనే విషయాన్ని కూడా ప్రస్తుతం ఇరిగేషన్ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. దీనికి తోడుగా ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఎక్కడెక్కడ చెరువులు దెబ్బతిన్నాయనే వ్యవహారాన్ని కూడా పరిశీలిస్తున్నారు.

> **కబ్జాకు గురవుతున్న చెరువులు..**
>
> జిల్లా అంతటా చెరువులన్నీ చాలా చోట్ల కబ్జాలకు గురైనట్లు అధికారులు తమ సర్వేలో నిర్ధారిస్తున్నారు. కొన్ని చోట్ల ఏకంగా చెరువు భూములన్ని కబ్జాలకు గురి కాగా ఆ చెరువుల రూపు రేఖలే మారిపోయాయని అం టున్నారు. చెరువుల కింది వ్యవసాయ భూములన్నీ రియల్ ఎస్టేట్ లుగా మారిపోవడంతో ఆ భూముల్లో సాగు పనులు నిలిచిపోయా యి. అలాగే పట్టణ ప్రాం తాలు సైతం చెరువు భూముల వరకు విస్తరించడంతో వాటి విస్తీర్ణమంతా కుచించుకుపోతోం ది. ఇలా చాలా చోట్ల చెరువులు కుధించుకుపోవడమే కాకుండా ఆ చెరువులకు సంబంధించిన భూములు యధేచ్చగా కబ్జాలకు గురవుతున్నాయి.

తుది దశలో నివేదికలు...

జిల్లాలో మొత్తం 659 చెరువుల సర్వేను చేపట్టేందుకు నిర్ణయించిన ఇరిగేషన్ శాఖ అధికారులు ఇప్పటి వరకు 550 చెరువులకు సంబందించి సర్వే జరపడమే కాకుండా నివేదికలు కూడా రూపొందించారు. అయితే చెరువుల స్థితి గతులతో పాటు వాటి పరిధిలోని కాలువలు, తూములు, ఆలుగు లాంటి స్థితి గతులపై కూడా నివేదికలు రూపొందించారు. చెరువు భూముల ఆక్రమణలపైనా రెవెన్యూ, పోలీసు శాఖలకు ఫిర్యాదులు చేయనుండగా వాటి ఆధునీకరణ మరమత్తు పనులకు సంబందించి తమ శాఖ ఉన్నతాధికారులకు నివేదికలు అందించనున్నారు. ఈ నివేదికల ఆధారంగా ప్రభుత్వం చెరువులను పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు నిధులు మంజూరు చేసే అవకాశం ఉంటుందని అంటున్నారు.



ముగిసిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం 58వ జాతీయ గ్రంథాలయ ముగింపు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ గ్రంథాలయ వారోత్సవాలు వారం రోజుల పాటు నిర్వహించి, వివిధ పోటీల్లో పాల్గొని గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి సభా అధ్యక్షులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమన్ అలీతో పాటు సామ భీమ్ రెడ్డి, ప్రత్యేక పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నాందేడపు చిన్ను, ఆహ్వానితులుగా పి. ప్రభాకర్ టీఎస్జీవోస్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు, సమర సింహారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, గణేష్, వసంతరావు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఎం. బిక్షపతి నాయక్ ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఆశాకిరణ్, కే. సుజాత, సునీత ఉపాధ్యాయురాళ్లు, గ్రంథాలయ సిబ్బంది పి. విజయ, కట్కం సంజీవ్ రెడ్డి, రాథోడ్ మోహన్ సింగ్, రాజు, పృథ్వీరాజ్, లెనిన్, బాబు రావు, రాథోడ్ మోహ న్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం

సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను
రైతులు సద్వినియోగం చేసుకోండి

ముథోల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని 13 కేంద్రాల్లో సోయాబీన్ కొనుగోలు సేకరణ జరుగుతుందని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ (ఎఫ్‌ఏసీ) డి. మహేష్ కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సోయాబీన్ కొనుగోలు పరిమితిని ఎకరాకు 7.62 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్లకు పెంచిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రైతులు తమ పంటను తగు విధంగా ఎండబెట్టి, తేమ శాతం 12 శాతం లోపుగా ఉంచి కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రస్తుతం సోయాబీన్‌కు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 5,328 ఉండగా, సూచించిన నిబంధనలను పాటిస్తే రైతులు పూర్తి ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

▸▸ నర్సాపూర్‌లో పార్టీ శ్రేణులకు రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ దిశా నిర్దేశం

నర్సాపూర్(జి), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ శాసన సభ్యులు, శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థుల విజయం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ పిలుపునిచ్చారు. నర్సాపూర్ మండల కేంద్రంలోని పద్మ శాలి సంఘం భవనంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావుల రాంనాథ్ మాట్లాడుతూ... సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలవాలంటే ప్రతీ బూత్ స్థాయిలో కార్యకర్తలు అంకితభావంతో పని చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. స్థానిక సమస్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విలాస్, మండల అధ్యక్షుడు బర్కుంట నరేందర్, జిల్లా కార్యదర్శి అర్జున్ సింగ్, మండల ప్రధాన కార్యదర్శి మహిపాల్, ఉపాధ్యక్షులు నవీన్, చందు, సంజయ్, కార్యదర్శులు గంగారాం, లక్ష్మణ్, బీజేవైఎం నాయకులు పల్లపు రాజు, ప్రవీణ్ పటేల్, రాజేందర్, హన్మాండ్లు, రమేష్, స్వామి, సంతోష్, సుదర్శన్ రెడ్డి, భోజన్నలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఇంటి స్థలాన్ని కబ్జా చేసిన
వ్యక్తిపై కేసు నమోదు చేయాలి

▸▸ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

నిర్మల్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కురన్నపేట్‌కు చెందిన ఆశా వర్కర్ నిగులపు రాజు ఇంటి స్థలాన్ని కబ్జా చేసి, తీవ్ర అన్యాయం చేసి బెదిరించి, ఆ స్థలంలో ఇంటిని నిర్మించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. నారాయణ, గంగారాం, రాపల్లి రాజేష్, బాధిత మహిళ నిగులపు రాజు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో లోటుపాట్లు ఉండొద్దు

▸▸ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని

నిర్మల్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు చోటు చేసుకోకుండా అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికల సమాయత్తాలపై గురువారం ఆమె హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాణి కు ముదిని మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి శాఖ పెద్దపీట వేయాలన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, రిజర్వేషన్ కేటాయింపు, శాంతి భద్రతల బందోబస్తు వంటి అంశాలపై అధికారులు ఒకటికి రెండుసార్లు పరిశీలనలు చేయాల్సిన అవసరాన్ని ఆమె గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు పని చేయనున్నట్లు తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, అధికారులు

శాంతి భద్రతల చర్యలపై సమీక్షించిన డీజీపీ శివధర్‌రెడ్డి

నిర్మల్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : 2025 సంవత్సరం జనవరి నుంచి సెప్టెంబరు వరకు నెలల క్రైమ్ రివ్యూ మీటింగ్ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించబడింది. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా నేర పరిస్థితులు, కేసుల విచారణ పురోగతి, శాంతి భద్రత చర్యలు, మహిళా - శిశు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ వంటి ముఖ్య అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సమావేశం జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల ఐపీఎస్ హాజరై జిల్లా నేర గణాంకాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తుల పురోగతి, నేర నియంత్రణ కోసం చేపడుతున్న చర్యల వివరాలను సమర్పించారు. డీజీపీ జిల్లాల వారీగా పనితీరును పరిశీలించి దర్యాప్తుల నాణ్యతను మరింత మెరుగుపరచాలని, ప్రజలకు వేగవంతమైన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల

కన్నిమ్మ చెరువులో మొసళ్లు

▸▸ అడవి బాతును రక్షించిన గ్రామవాసి

లక్ష్మణచందా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్‌పెల్లి గ్రామంలోని కన్నిమ్మ చెరువులోకి వచ్చిన మూడు మొసళ్లు భయాందోళనకు గురి చేస్తున్నాయి. గోదావరి వరద కారణంగా కన్నిమ్మ చెరువులోకి మూడు మొసళ్లు చేరాయి. కాగా కన్నిమ్మ చెరువులో మొసలి బారినుంచి అడవి బాతును ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కంకళ్ల కళ్యాణి భర్త గోవర్ధన్ కాపాడిన వీడియో గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ అడవిబాతును మొసలి పట్టుకుని లాగుతున్న దృశ్యాన్ని సమీపంలో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు చూసి ఆందోళన చెందారు. ఈ విషయాన్ని గమనించిన గోవర్ధన్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పొడవైన కర్ర తీసుకుని మొసలిని కొట్టి అడవి బాతును కాపాడాడు. ఈ విషయాన్ని చూసిన విద్యా ర్థులు ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు. అటవీ శాఖ అధికారులు మొసళ్లను చెరువు నుంచి తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మొసలిని కర్రతో కొట్టి అడవిబాతును కాపాడుతున్న గోవర్ధన్

మళ్లీ సోయా వాపస్

▸▸ ఆందోళనలో రైతులు

కుంటాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పంటను పండించుకోవడం ఒక ఎత్తయితే నేటి రోజుల్లో పంటను విక్రయించుకోవడం సవాల్‌గా మారింది. అసలే అధిక వర్షాలు కారణంగా పంటలు నాణ్యత తగ్గి, దిగుబడులు తగ్గి ఆందోళనలో ఉన్న రైతన్నకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మరో సమస్య వచ్చి పడుతోంది. తాజాగా కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసి గోదాంకు పంపిన ధాన్యాన్ని అధికారులు తిరిగి వాపసు పంపుతున్నారు. తూకం వేసే సమయంలో సహకార సంఘం సిబ్బంది సోయాలను జల్లెడ పట్టి మరీ తూకం వేసినప్పటికి అక్కడి అధికారులు గోదాంలో ఖాళీ చేసే సమయంలో ధాన్యం నాణ్యతగా లేదని పేర్కొంటూ వాపసు పంపుతున్నారు. రెండు రోజుల క్రితం కుంటాల మండల రైతులు కల్లూరు గ్రామంలో కొనుగోళ్ల విషయమై ధర్నా చేశారు. అయితే మార్క్‌ఫెడ్ సిబ్బంది వచ్చి రైతుల సోయాను నాణ్యమైన సోయా అన్ని కొంటామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు. తాజాగా గురువారం విట్టాపూర్ కొనుగోలు కేంద్రం నుంచి తూకం వేసి గోదాంకు పంపిన లారీలో నుంచి 95 బస్తాలు వాపసు పంపారు. ప్రభుత్వం ఇప్పటికైనా సోయాను కొనుగోలు చేసి ఆదుకోవాలని పేర్కొన్నారు.



పెంచికల్‌పాడ్‌లో వాపసు వచ్చిన సోయాతో ఆందోళన చేస్తున్న రైతులు

మార్మోగిన వందేమాతరం

▸▸ గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద వాకర్స్, స్విమ్మర్స్ ఆధ్వర్యంలో గేయాలాపన
▸▸ భారీగా హాజరైన వాకర్స్, స్విమ్మర్స్, యోగా సాధకులు

భైంసా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు పరిసర ప్రాంతాలన్నీ గురువారం వందేమాతరం నినాదాలతో మార్మోగిపోయాయి. వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని భైంసా వాకర్స్ అండ్ స్విమ్మర్స్ అసోసియేషన్ గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద వందేమాతరం గేయాన్ని సాముహికంగా ఆలపించే కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులతో పాటు సాముహిక గేయాలాపన కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ చేపట్టిన వందేమాతరం నినాదాలు హోరెత్తాయి. అసోసియేషన్ అధ్యక్షుడు సాయినాథ్ బచ్చువార్ ఆధ్వర్యంలో జరిగిన సాముహిక గేయ ఆలాపన కార్యక్రమానికి భైంసా టౌన్ సీఐ గోపీనాథ్, ఎంసీటీ చైర్మెన్ డా. నగేష్, ఆరోగ్య భారతి ప్రతినిధి డా. రామకృష్ణగౌడ్, లయన్స్ క్లబ్ ప్రతినిధి డా. ముత్యంరెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు సాధుల కృష్ణదాస్, అడెపు శ్రీనివాస్, వీహెచ్‌పీ ప్రతినిధులు గుజ్జల్‌వార్ వెంకటేష్, పెరుగు నవీన్, లక్ష్మీ నరసింహ యోగా గ్రూప్ శిక్షకులు డా.మహిపాల్ రెడ్డి, సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ ప్రతినిధి శివ బచ్చువార్, వివేకానంద ఆవాసం అధ్యక్షుడు శైలేష్ మహాశెట్టివార్ నేతృత్వంలో వందలాది మంది వాకర్స్, స్విమ్మర్స్, యోగా సాధకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట సమయంలో వందేమాతరం గేయ ఆలాపనతో జరిగిన పరిణామాలు, దేశవాసుల ఐక్యతకు దోహదపడిన అంశాలను వివరించారు. వాకర్స్, స్విమ్మర్స్ అసోసియేషన్ ఆరోగ్య స్ఫూర్తిని పెంపొందింప చేసే కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా ఐక్యత, దేశభక్తి, జాతీయత భావాలు పెంపొందింప చేసే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందులో భాగంగా వీహెచ్‌పీ ప్రతినిధి పెరుగు నవీన్ ఆలపించిన పలు దేశభక్తి గేయాలు కార్యక్రమానికి వన్నె తెచ్చాయి. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు సాముహిక వందేమాతరం గేయ ఆలాపన కార్యక్రమాలు జోరుగా.. హుషారుగా కొనసాగాయి.



వందేమాతర గేయ ఆలాపన చేస్తున్న వాకర్స్, స్విమర్స్ అసోసియేషన్ సభ్యులు